క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీకి చెందిన మెట్ట భాగ్యమ్మకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, గణేష్ ముదిరాజ్, నాయినేని చంద్రకాంత్‌రావు, మారబోయిన రాజు యాదవ్, హరినాథ్, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని సుమిత్రానగర్, జాతీయ రహదారి పైన చైతన్య నగర్, వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని చలివేంద్రాన్ని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం ప్రారంభించారు. మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కాలనీ మెయిన్ సెంటర్‌లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, చైతన్య నగర్ కమిటీ మెంబర్స్, సుమిత్ర నగర్‌వాసులు పాల్గొన్నారు.

కళారత్న రవికి సన్మానం



రవిని సన్మానిస్తున్న అంజిరెడ్డి తదితరులు

మోతీనగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది సందర్భంగా భవిరి రవిని కళారత్న పురస్కారం అందించింది. ఈ సందర్భంగా నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మోతీనగర్‌కు చెందిన ఎంపీఏ మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి గజమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. మిమిక్రీలో రవి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో వీవీ సుబ్బారావు, పరుచూరి రమణ, జీఎస్ఎన్ మూర్తి తదిరతులు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి ముస్లిం బస్తీలో ఇబ్బు ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈద్ మీలాబ్ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొన్నారు. ఆయనను సన్మానించారు.

– ఓల్డ్‌బోయిన్‌పల్లి

పేదోడి కడుపు నింపడమే లక్ష్యంగా

సన్నబియ్యం పంపిణీ

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



హనుమాన్ నగర్ కాలనీలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు



ఎల్లమ్మబండలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పేద ప్రజల కడుపు నింపుడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో మంగళవారం సన్నబియ్యం పంపిణీని బాలానగర్ ఏఎస్ఓ కల్యాణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రతి పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మందికి ఆరు కిలోల సన్నబియ్యం అందజేయటం జరుగుతుందన్నారు. అందుకు ఎన్ని వేల కోట్ల రూపాయల ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పర్వదినం నుంచి ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఈ పథకాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని అన్నారు. రేషన్ బియ్యం అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో తిరిగి ఇస్తే నాలుగు పేద కుటుంబాలకు అండగా నిలిచిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, గణేష్, నాయినేని చంద్రకాంత్‌రావు, రాజు యాదవ్, హరినాథ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, ఎల్లంనాయుడు, చంద్రమోహన్ సాగర్, ఎర్ర లక్ష్మయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో..

ఆల్విన్‌కాలనీలోని ఎల్లమ్మబండలో రేషన్ షాపులో పేద ప్రజలకి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జెరిపేటి జైపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు, శేరిలింగంపల్లి ఏ బ్లాక్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సూర్యవంశం రూబిన్, వైస్ ప్రెసిడెంట్ ఎం. రాజా, ఎస్సీ సెల్ సున్నం నారాయణ, జోసఫ్, బీసీ సెల్ సన్యాసిరావు, రామచంద్రుడు, తెనాలి పంతులు, అవాజ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారగల్ల సంజీవరావు అధ్యక్షతన ప్రారంభించారు. కార్యక్రమంలో కొండల్ రెడ్డి, కొమ్ము బాబురావు, గండమల్ల రాజేంద్ర కుమార్, అక్కపల్లి రాము, కూతురు సురేష్, చేగూరి రాజు, బాలరాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో సన్నబియ్యం పంపిణీలో నాయకులు సంజీవరావు తదితరులు

కాంగ్రెస్ పాలన దేశానికి ఆదర్శం

మోతీనగర్: ప్రజా సంక్షేమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్, రోడ్డు నంబర్10లోని రేషన్ దుకాణంలో బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు మొయినొద్దీన్, సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డితో కలిసి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహ యాదవ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, మహిళా అధ్యక్షురాలు భారతమ్మ, సీనియర్ నాయకుల జమీల్ బాయ్, రవీందర్, సుంకన్న, సతీష్‌రెడ్డి, కృష్ణమూర్తి, అహ్మద్, అబ్దుల్లా, గోపాల్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితరులు

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



మాధవరం కాంతారావును హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

కూకట్‌పల్లి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న 400 ఎకరాలు భూమి వేలంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో వివిధ పార్టీల నేతలను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిరసనలు, ర్యాలీలు చేస్తున్న విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఉచిత హామీలను నెరవేర్చడానికి ఇలా హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు దిగజారుతున్న ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. వెంటనే భూముల వేలంను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మోతీనగర్: ముందస్తు అరెస్టుల్లో భాగంగా బీజేపీ జిల్లా కార్యదర్శి పుల్లిగొల్ల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి అమరేష్ రాజులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యా వ్యవవస్థలో రాజకీయ జోక్యం తగదని, విద్యావ్యవస్థకు సంబంధించిన ఆస్తులను విద్యావ్యవస్థకే కేటాయించాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు రూ. 2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో 27 అడుగుల ఆంజనేయ స్వామి, గరుడ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీనికి గాను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రూ. 2 లక్షలను విరాళంగా అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఆలయ ఈవోకు చెక్కును కార్పొరేటర్ అందజేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేత



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కుర్మ సంఘం నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలకు హాజరు కావాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కుర్మ సంఘం నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మంగళవారం ఆహ్వానించారు. ప్రతి సంవత్సరం లాగే ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చెరువు కట్ట దగ్గర ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు ఐలేష్ , మల్లేష్, మేకల హరినాథ్ పాల్గొన్నారు.

మోతీనగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

మోతీనగర్: మోతీనగర్‌లో నెలకొన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కృష్ణారావును కోరారు. ఈ మేరకు మంగళవారం మోతీనగర్ వాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌ల పరిధిలోని పలు బస్తీ కాలనీల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ పనుల తరువాత వ్యర్థాలను మోతీనగర్ మీ సేవ సమీపంలోని పార్కు స్థలంలో డంపింగ్ చేస్తున్నారని, దీంతో దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. నెలల కొద్దీ వ్యర్థాలను పార్కు స్థలంలో ఉంచడటంతో అదే మట్టిని చదునుగా చేసి కుప్పలుగా పోస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు, వెంకటస్వామి, హేమంత రావు, శ్రీహరి, అగర్వాల్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న మోతీనగర్ వాసులు

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాతపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాత పంజాల జైహింద్ గౌడ్‌పై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరమల్ల కేశవరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 11 సంవత్సరాల్లో బీసీ కమిషన్‌కు ఏర్పాటు చేస్తూ చట్టబద్ధత కల్పించడంతో పాటు కేంద్ర మంత్రులలో ఎక్కువమంది బీసీలకు స్థానం కల్పించారన్నారు.

మన రాష్ట్రం నుంచి బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మణ్‌ను నియమించారని గుర్తు చేశారు. బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న నరేంద్ర మోదీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన జైహింద్‌గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, రామరాజు, మణిభూషణ్, నర్సింగ్ యాదవ్, హరియాదవ్, నర్సింగరావు, కమలాకర్ రెడ్డి, నరసింహచారి, గోపాల్‌రావు, శంకర్, టప్ప రఘు, సాయి, వంశీ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, రేషన్ రాజు, జ్యోతి, మమత, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఘటనపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

నిజాంపేట్ : రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించేందుకు చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రగతినగర్ మంకీ స్ట్యాచ్యూ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులను యూనివర్సిటీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. తక్షణమే భూముల అమ్మకాన్ని రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

మోతీనగర్: మూసాపేట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో ఎన్. పేరని ప్రముఖ కళాకారుడి ఆధ్వర్యంలో హిందుస్తానీ క్లాసికల్ మ్యూజికల్ భక్తి సంగీత విభావరి ఘనంగా నిర్వహించారు. బుధవారం భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం స్వర్ణాలయ చక్రవర్తి గానకల సార్వభౌమ వండర్ బుక్ ఆఫ్ రికార్డు వరల్డ్ రికార్డు గ్రహీత వైఎస్. రామకృష్ణ బృందంచే భక్తి గీత విభావరి, 4న భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. ముగింపు సందర్భంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి బీ బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఆలయ కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు అనుపమ, దూడల జనార్దన్ గౌడ్, అనిల్‌కుమార్ ఆచార్యులు, రామకృష్ణ, నాగేశ్వరరావు, మల్లికార్జున రెడ్డి, నాయకులు ప్రతాప్, ఎస్. ఇంద్రజిత్ సింగ్, ఆలయ సిబ్బంది, రాజు, సర్వేశ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధేది!

పట్టించుకోని అధికార యంత్రాంగం

- కిష్టాపూర్‌లో ఇటీవల 47 క్వింటాళ్ల ఆహార పదార్థాలు సీజ్
- శుభ్రత పాటించని ఆహార విక్రయశాలలు
- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత

ఆకర్షణీయమైన ప్యాకింగ్, వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు, బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది.

– సాక్షి, సిటీబ్యూరో



నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, ఆహారపదార్థాలు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

దాడుల్లో విస్తుపోయే విషయాలు

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల రాష్ట్ర ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) టాస్క్‌ఫోర్స్ బృందం పసుపు, కారం, మసాలాల తయారీకేంద్రాలతో సహా నిల్వ, విక్రయ కేంద్రాలు, పలు రెస్టారెంట్లపై దాడులు నిర్వహించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మేడ్చల్ మండలం కిష్టాపూర్‌లో హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో దాడులు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ బృందం ఆహార పరిరక్షణ ఉల్లంఘనలను గుర్తించింది.

శుభ్రత శూన్యం

పారిశుద్ధ్య లోపంతో సహా మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాలలో పరిశుభ్రత లేదని గుర్తించారు. కలుషిత వాతావరణంతో నేల శుభ్రంగా లేకపోవడం, పైకప్పు మీద బూజు, స్పైడర్ వెబ్స్ ఉన్నట్లు బృందం నిర్ధారించింది. ఆహారపదార్థాల నిల్వ, పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వంటి పదార్థాలు పూర్తిగా శుభ్రత లేని కారణంగా ఫంగస్‌తో కూడిన ప్లాస్టిక్ కంటైనర్లలో నిల్వ చేయటం, కీటకాలు, పురుగులు పట్టిన కొబ్బరి పొడి, ఎండు మిర్చిని ముడి పదార్థాల స్టోర్‌రూమ్‌లో గుర్తించారు.

రూ.3.03 లక్షల విలువైన కల్తీ పదార్థాల నిల్వ

అధికారుల తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం, వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ.3.03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

దుర్వాసన ఉన్న పదార్థాలు ధ్వంసం

మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, తేదీలు లేనివి, అధిక దుర్వాసనతో ఉన్న ఉత్పత్తులను ధ్వంసం చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో తుప్పు పట్టిన మిషనరీ ఉపయోగించి పలు ఆహార పదార్థాలు తయారీ చేస్తున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృందం సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయడంతో పాటు అనుమానిత ఆహార పదార్థాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. ఇదే పరిస్థితి శివారుల్లో అంతటా నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు గాలికి

ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి.

వినియోగదారుల చట్టం ప్రకారం..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు జిల్లాల్లో అమలుకు నోచుకోవడం లేదు. కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపుల ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు.

రహదారులపై నిత్యం రద్దీగా..

ప్రతిరోజూ వాహనాల రాకపోకలతో రహదారులు దుమ్ము, ధూళి ఆహారపదార్థాలపై పడుతోంది. నిర్వాహకులు వాటిని అలాగే విక్రయిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

మాంసం విక్రయాల్లోనూ అంతే

నగర శివారుల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించడం లేదు.

పర్యవేక్షణ లోపం

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండడంతో పాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయ విక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.